# ఊరేగింపు

పి.వి.ఓ.యస్. మూర్తి



క్రిట్టయ్య కూలిపని చేసుకుని పొట్ట పోసుకునే సామాన్యుడు. కిట్టయ్య తండ్రి నందయ్య చని పోతూ కిట్టయ్యకు మిగిల్చిన ఆస్తి పాస్తులన్నీ కాళ్ళూ-చేతులే. గత్యం తరం లేని కిట్టయ్య వాటినే నమ్ము

కుని కాలం వెళ్ళబుచ్చేవాడు.

ఒకేపని అనిగానీ, ఒకేచోట అనిగానీ నియమం ఉండేది కాదు కిట్టయ్యకు. ముందూ, వెనుకా 'నా' అనేవాళ్ళు ఎవ్వరూ లేక పోవటంతో, ఏ రోజు ఎక్కడ ఏ పని చేయాలనిపిస్తే అక్కడ ఆ పని చేస్తుండేవాడు. ఏ పని చేసినా ఎక్కువ బాడుగకోసం మాత్రం తెగ తాపత్రయ పడేవాడు. కూలి పేటలో ఓ చిన్న పూరిపాకలో నివసిస్తున్న కిట్టయ్యను తెలిసిన ఆ పేటలోని ఇరుగు పొరుగువాళ్ళు, 'ఈ ఒంటరిగాడికి డబ్బుమీద ఇంత పిచ్చి ఏమిటో' అనుకుని విస్తుపోతుండేవారు.

కిట్టయ్య ఎక్కువగా ఎవ్వరితోనూ కలపి, మెలసి తిరగక పోవటంవల్లా తను తన పని తప్ప ఇతర విషయాల జోలికి పోక పోవటంవల్లా, వాళ్ళు అలా అనుకోవటం సహజమే.

అందుకేనేమో,'అసలు కిట్టయ్య ఎవరూ? అతని తత్వం ఏమిటి?' అనేది ఎవరికీ తెలియదు.

* * *

కిట్టయ్యను ప్రసవించి యశోదమ్మ కన్ను మూసింది. తల్లి లేని బిడ్డయిన కిట్టయ్యకు తల్లీ తండ్రీ తనే అయి నందయ్య తన కున్నంతలో కొడుకును అల్లారు ముద్దుగా పెంచసాగాడు.

ఒకనాడు నందయ్య పనిచేసే జమీందారుగారి అబ్బాయిగారి పుట్టిన రోజున, ఆ గ్రామంలో చిన్న జమీందారుగారుగా ఆయనను ఊరంతా ఊరేగించటం తన తండ్రి భుజాలపై వింతగా చూసిన క్షణాలలో, ఆ చిన్ని మనసులో తను కూడా ఎప్పటికైనా, ఒక్కసారైనా అలా ఊరేగాలనుకోవటం తప్పనిపించేది కాదు కిట్టయ్యకు. తప్పనిసరిగా కూడా అనిపించేది. పైపెచ్చు ఆ ఊహ ఎంతో అహ్లాదంగానూ, అబ్బురంగానూ ఉండేది.

ఆ ఉత్సాహంతోనే తన కోరికను తండ్రికి చెప్పబోతే—

'తప్పు నాన్నా! అలాంటి సరదాలూ, సంతోషాలూ ఆ మారాజులకే చెల్లాయి. మనబోటి వాళ్ళం అట్టాంటి కోరికలు కోరుకోవటం, అలా జరగాలనుకోవటం తప్పు. ఆళ్ళు సల్లగా ఉంటేనే మనకింత కూడూ, నీళ్ళూ దొరుకుతాయి. ఆళ్ళు సేవలు చేయించుకోవటానికీ, మనం చేయటానికీ పుట్టాంరా! అంచేత అట్టాంటి అలోసన్లు మనకి ఉండటం కానా తప్పు బాబూ!'

అంటూ ఎంతో అమాయకంగా మందలించేవాడు. ఆ మందలింపే

తనలో మరింత పట్టుదలను పెంచేది. ఏదో తెలియని ఆవేశం కూడా వచ్చేది ఆ మాటలకు.

వయస్సుతోపాటు కిట్టయ్య కోరికా పెరగసాగింది. తండ్రి నందయ్య కూడా కాలగర్భంలో కలిసిపోవటంతో, ఆ పల్లెలోనే ఉంటే తన ఆశ నెరవేరటం కష్టమని తలచి, పట్నం చేరిన కిట్టయ్యకు రెండు పూటలా కాపిన్ని గంజినీళ్ళకే ఎంత కష్టించాలో కొద్ది రోజుల్లోనే తెలిసొచ్చింది.

అందుకే యవ్వనం తోడును కోరుకుంటున్నా, పెళ్ళీ గిళ్ళీ లేకుండా, సంపాదించిన దానిలో ఫుట్‌పాత్‌లపై ఉండే కె. కె. విలాస్ (కక్కుర్తి కోమలావిలాస్) లలో కక్కుర్తిగా కడుపు నింపుకొంటూ, రోజూ ఎంతో కొంత వెనకేస్తున్నాడు. అలా చీమలు చక్కెర పోగుచేసినట్లు కడుపు కట్టుకుని పైసా పైసా పోగుచేసి ఆ డబ్బుతో ఎప్పటికైనా తన కోరిక తీర్చుకోవాలన్నదే కిట్టయ్య ధ్యేయం.

అలా ఎప్పుడూ మనసునిండా అదే ఆలోచన కావటంవలన మరో విషయం గురించి ఏమాత్రం పట్టించుకోవడంగానీ, ఇతరులతో కలివిడిగా మసలడంగానీ చేసేవాడు కాదు.

ఆ కారణంగానే పరులగురించి కిట్టయ్యకు ఏ విషయమూ అవసరం లేదు తన గురించి ఇతరులెవ్వరికీ ఏమీ తెలియదు.

* * *

అంతకు కొద్దిరోజుల ముందే జరిగిన ఎన్నికలలో ఆ నియోజక వర్గంనుండే ఎమ్ ఎల్ ఏ గా ఎన్నికైన తర్వాత సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పదవిని చేపట్టిన సభాపతి (పూర్వాశ్రమంలో పేరుమోసిన గుండా) ప్రమాణ స్వీకారం గావించి మంత్రిపదవి చేపట్టిన పిదప తొలిసారిగా తన స్వస్థలానికి విచ్చేస్తున్న సందర్భంలో, తన పార్టీ కార్యకర్తలమని చెప్పుకునే వాళ్ళూ, ఇతరత్రా పెద్ద మనుషులూ. బడా వ్యాపారస్థులూ వగైరా కలిపి. తమ తమ స్వప్రయోజనాలకోసం మంత్రిగారికి ఏర్పాటుచేసిన ఘనమైన సన్మానానికి వచ్చేందుకు- సగటు ప్రజలకు ఆపాటి కోరికా, తీరికా. ఓపికా ఉండదని తెలిసిన తెలివైన సన్మాన సంఘసభ్యులు- కార్యక్రమం అభాసుపాలు కాకుండా ఉండేందుకు, చుట్టుప్రక్కల పల్లెటూళ్ళనుండి కబేళాకు మేకలను తోలుకెళ్ళినట్టు గొర్రెల్లాంటి అమాయక ప్రాణులైన మనుషుల్ని లారీలమీద మంత్రిగారి ఊరే

గింపులో పాల్గొనడానికీ, సన్మాన సభకి హాజరయి, బహిరంగ సభను జయప్రదం చేయటానికీ, ఇటువంటి సభలకు కమీషన్ పద్ధతిమీద మనుషులను ఏర్పాటుచేసే 'మెన్ సప్లయర్స్' అనబడే దళారీలద్వారా మోసుకొచ్చే ఏర్పాటు చేసారు.

లోగడ అటువంటి ఒకటి, రెండు సందర్భాలలో పాల్గొన్న కిట్టయ్య, ఆ రోజు మంచి కూలిగిట్టే రోజయినందుకు తెగ సంబరపడి ఊరేగింపులో నినాదాలివ్వటానికీ, మందుగుండు వెలిగించేందుకూ బాడుగకు కుదిరాడు.

సన్మానం జరిగే రోజువచ్చింది. ఊరంతా- బేనర్లు, వాల్ పోస్టర్లు, పార్టీ జండాలు మొదలైన అలంకరణలతో కొత్త పెళ్ళికూతుర్లా కళ- కళలాడుతోంది.

ముందు రెండు, వెనుక రెండు వందిమాగదుల కార్లతో మంత్రిగారి కారు ఊరి పొలిమేరల్లో అడుగు పెట్టింది. గోతికాడ నక్కల్లా కాచుకున్న సన్మాన సంఘ సభ్యుల సైగతో ముందుగా ఏర్పాటుచేసిన మందుగుండు పేలటం, వెలగటం, నక్షత్రాలను తాకాలన్నంత వడిగా పైకి ఎగసిపోవటం మొదలయ్యాయి. కోలాటాలు, తప్పెట గుళ్ళు, పులివేషాలు, దొమ్మరి నృత్యాలు ప్రారంభమయ్యాయి. యూనిఫారమ్‌లో ఉన్న వాద్యగాళ్ళ హోరు మొదలయ్యింది. ఆ వెనుక టాప్‌లేని జీపులో దండలలో మునిగిపోయి రెండు చేతులెత్తి నమస్కరిస్తూ, షష్టిపూర్తి పెళ్ళికొడుకులా ఉన్న మంత్రి సభాపతి, చుట్టూ బాకాగాళ్ళ- 'సాంఘిక సంక్షేమశాఖామాత్యులు శ్రీ సభాపతిగారికీ-జై' అంటున్న జయ, జయ ధ్వానాలతో ఊరేగింపు బయలుదేరింది.

ఆ జేజే కేరింతల్లో-

తన పని మరచిపోయి కిట్టయ్య పంచరంగుల తెలుగు సినిమాలోని కల సన్నివేశంలోలా తననే సభాపతి స్థానంలో ఊహించుకుని మురిసిపోతున్నాడు.

అంతలో భీకరమైన శబ్దంతో పేలిన మిన్నా కిట్టయ్య ఆలోచనల్ని బద్దలు చేయటంతో, కలల అలల్లో నుండి తేరుకున్న కిట్టయ్య ఒకసారి తన ఊహకు తనలో తనే మెచ్చుకోలుగా నవ్వుకుని, ఆ ఆనందంతో తనూ జువ్వలు వెలిగించడం మొదలెట్టాడు. పైకి ఎగిరిన జువ్వలు ఆ తరువాత క్రిందకు రాబోతున్నంతలో రంగు రంగు వెలుగు జిలుగుల పూలవానకురుస్తూ, ఆ పూలలో నుండి బాంబులు పేలటం చాలా తమాషాగా అనిపిస్తుంది కిట్టయ్యకు ఆరోజు. ఆ సంతోషంలో మరింత

ఉత్సాహంగా జువ్వలు వదల సాగారు.

ఊరేగింపు ఊరి మధ్యకు వచ్చింది. కిట్టయ్య మందుగుండు వెలిగిస్తూనే ఉన్నాడు ఉత్సాహంగా. అంతలో అల్లంతదూరాన విపరీతమైన పొగ ఆకాశంలోకి రావటం కిట్టయ్య కళ్ళబడింది. తన ఇల్లు అటే కావడంతో కిట్టయ్య కీడు శంకించి ఒక్కుదుటున ఊరేగింపు నుండి ఇంటివైపు పరుగు లంకించుకున్నాడు ఇంటి దరిదాపులకు చేరుకున్నాడు. ఇంకేముంది? తను కూలిపేక అంతా తగలడి పోతోంది. పిన్నలూ, పెద్దలూ హడావిడిగా అరుపులతో, కేకలతో ఏడుపులూ, పెడబొబ్బలతో పరుగులు పెడుతున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ భీభత్సం చూడాల్సిందే తప్ప చెప్పనలవి కానంతగా ఉంది.

కిట్టయ్య మనసు వికలమైంది. తన డబ్బుసంచి ఇంటిలో ఉండిపోయింది ఇన్నాళ్ళూ, ఇన్నేళ్ళూ రెక్కలు ముక్కలు చేసుకుని ఒళ్ళొంచి కష్టించి, తినో- తినకో సంపాదించుకున్న కష్టార్జితం బుగ్గిపాలు కాబోతుంది.

ఆ డబ్బు పోతే తను జీవితంలో ఇక ఊరేగింపు జరుపుకోలేడు. అదే జరిగితే తన జీవితాశయం నెరవేరదు. ఈ బ్రతుకు పందెంలో ఓడిపోయి జీవితంతో రాజీపడి బ్రతకాలి.

ఆ తలపే కిట్టయ్యకు భరింపశక్యం కాకుంది. తమాయించుకోలేకపోయాడు. స్థాణువులా నిలబడివున్న కిట్టయ్య ఉన్నట్లుండి ఇంటిలోనికి పరుగుతీశాడు. ఎంతమంది అడ్డుతున్నా, అడ్డొస్తున్నా, వారిస్తున్నా లక్ష్యపెట్టకుండా

ఇంటిలోనికి ప్రవేశించాడు. నిప్పులన్నీ, మంటలన్నీ తప్పించుకుని తన పెట్టెవద్దకు చేరాడు పెట్టె తెరిచి డబ్బు సంచితీసి పట్టుకుని వెనుతిరిగాడు అంతలో కాలిన ఇంటి దూలం కిట్టయ్యపై పడింది. అంతే! కిట్టయ్య నేలకంటుకుపోయాడు.

కాస్సేపటికి ఫైరింజన్ వచ్చింది. ఎట్టకేలకు మంటలు ఆరాయి. చేతిలో సగంకాలిన డబ్బుసంచితో చచ్చిపడున్న కిట్టయ్య శరీరాన్ని బయటకు తీశారు నిలువనీడ పోయినా అదృష్టవశాత్తూ కిట్టయ్య తప్ప మరెవ్వరూ చనిపోలేదు ఆ దుర్ఘటనలో [illegible]ముకే కాబోలు, అంత బాధలోనూ కొంతసేపటికి ఆపేటలోని వారందరూ కలిపి సగంకాలి చచ్చిపోయిన కిట్టయ్య అంతిమయాత్ర శాస్త్రోక్తంగా జరపాలనుకున్నారు.

అక్కడ సభలో, సభాపతి ఉపన్యాసానికిముందు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో, వెండి పళ్ళెంలో సభాపతి కాళ్ళు కడిగారు నిర్వాహకులలో ఒకరు.

ఇక్కడ కిట్టయ్య శరీరానికి స్నానం చేయించారు.

మంత్రిగారికి దుశ్శాలువ కప్పారు.

కిట్టయ్యకు అప్పుడు అక్కడ మిగిలివున్న వాటిలో మంచిగుడ్డనొకదానిని చుట్టబెట్టారు.

సభాపతి నుదుట కళ్యాణ తిలకం దిద్దారు.

కిట్టయ్యకు బొట్టు పెట్టారు.

మంత్రిగారిని వరుసగా పూలదండలతో ఏకబిగిని ముంచెత్తి వాటితోనే బాధించినంత పని చేశారు.

కిట్టయ్య శరీరాన్ని పాడెకు కట్టారు.

సభాపతికి హారతి పట్టారు.

కిట్టయ్య పాడెముందు కుండలో పొగ లేచింది.

అనర్గళమైన ఉపన్యాసంలో- అడగకుండానే ప్రజలనబడే ఓటర్లకు ఎన్నెన్నో వాగ్దానాలిచ్చి, సభనుండి తిరుగుముఖం పట్టిన మంత్రిగారి కారు, కిట్టయ్య శవం వెళుతున్న దారిలోనే కాస్తంత దూరంగా వెళుతుంది. కారులో తన పక్కనున్న వ్యక్తి చెప్పిన మాటతో కారు ఆపుజేయించి, మంత్రి సభాపతి కారుదిగి కిట్టయ్య శవంవద్దకు వెళ్ళి, నడిరోడ్డు మీద రెండు నిమిషాలు మౌనం పాటించాడు. వందిమాగదులు కూడా అనుసరించారు.

పాడెమీదున్న కిట్టయ్య ముఖం 'ఊరేగింపుకే ముందుగుండు వెలిగించి నా బ్రతుక్కి నిప్పెట్టుకున్నానా?'

అని ప్రశ్నిస్తున్నట్టుంటగా-

'నాకు ఓటేసినప్పుడే మీకు మీరు నిప్పెట్టుకున్నారు. ఇప్పుడు మళ్ళీ మరోసారి పెట్టుకునేదేముంది?' అని జవాబిస్తున్నట్టుగా ఉంది సభాపతి మోము.

ఆ సందర్భాన్ని మంత్రిగారి ఆస్థాన ఛాయాగ్రాహకుడు తన కెమెరాలో బంధించాడు.

అప్పుడు రోడ్డుకు ఇరుప్రక్కలా ఎన్నికల ప్రచారానికి వ్రాసిన వ్రాతలతో కరాబై ఉన్న గోడలు—

'ఏది ఏమైనా కిట్టయ్యా, నీకింతకంటే ఏం కావాలయ్యా? ఆం ఇప్పుడే మంత్రిగారు సభలో బహిరంగంగా 'ఎవరికి ఏది కావాలంటే అది చేస్తాను' అని చెప్పారయ్యా! చెప్పినట్టుగానే నువ్వు ఊహ తెలిసినప్పటినుండి కోరుకుంటున్న ఊరేగింపు బ్రతికుండగా నీకు

విజయ

చందా

| | | |
|---|---|---|
| సంవత్సరం | 48 | రూ |
| అర్ధసంవత్సరం | 24 | రూ |
| విడి ప్రతి | 4 | రూ |


జరగకపోయినా, నువ్వు జరిపించుకోలేకపోయినా, నువ్వు చెప్పకపోయినా నీ మనసు తెలుసుకొని వచ్చిన తర్వాతైనా అంతంత మాత్రంగానే జరుగుతున్న నీ ఊరేగింపుకువచ్చి, నీ ఆత్మశాంతి కోసం ప్రార్థించి, నీతో కలపి ఫోటో దిగి, నీ ఊరేగింపుకు వన్నె తెచ్చి, నీ చావు ఊరేగింపును కూడా బ్రహ్మాండంగా జరిపించారయ్యా!

'ప్రజలసేవ సంగతి తరువాత, ముందు-గెలిచిన వాళ్ళయినా కనీసం ఖరాబుచేసిన మా ముఖాలైనా తెలుపుజేయండి' అని మేం అడగకపోవటం వల్లనే మంత్రిగారు ఊరుకున్నారు గానీ, లేకపోతే ఎప్పుడో మా కోరిక కూడా మన్నించేవారు. తెలుసా?

'ఒక మంత్రిగారు, అందునా సాంఘిక సంక్షేమశాఖామాత్యులు తమకు ఓటేసే వెధవలున్న ఈ సో కాల్డ్ హిపోక్రటిక్ ప్రజాస్వామ్యంలో ఇంతకంటే ఏం చేస్తారు? అసలు ఏం చెయ్యగలరు? మువ్వే చెప్పు! ఏమయినా అదృష్ట మంతుడివోయ్ కిట్టయ్యా!'

అవి వ్యంగ్యంగా అంటూ పగలబడి నవ్వుతున్నట్టున్నాయి.

మంత్రిగారి కారు కదిలింది ప్రగతివైపు.

కిట్టయ్య ఊరేగింపు కొనసాగింది కాటి వరకూ. ●